


# వేట

'మధుచక్రవర్తి'

**నెమ్మది** నెమ్మదిగా తెరుచుకుంటున్న అతని కళ్ళకు, కొద్ది కొద్దిగా అక్కడి పరిసరాలు స్పష్టమవుతున్నాయి.

వెదురు బొంగులు దగ్గర దగ్గరగా చేర్చి కట్టిన కుటీరం.

అక్కడక్కడా వ్రేలాడదీసిన జంతు చర్మాలు. . .కొమ్ములు. . .

ఏదో కోయగూడెంలో ఉన్న ట్టని పించింది అతనికి.

"తల్లి కరుణించింది. . .అయ్య కళ్ళు తెరిచిండు..."

ఆశ్చర్యంతో కనులు పూర్తిగా తెరిచా డతను.

తన ఎదురుగా ఎవరో కోయ యువతి ముంగాళ్ళ మీద కూర్చుని, మనసులోనే ఎవరికో నమస్కరిస్తున్నట్టు అరచేతులు రెండూ దగ్గరకు చేర్చి కనులు మూసుకుని ఉంది.

పరీక్షగా ఆమెను చూశా డతను. వయసు ఇరవై లోపే ఉండొచ్చు. మెడలో రకరకాల పూసల దండలతో ప్రత్యేకంగా ఉన్న ఆమె అలంకరణ అతడిలో మరింత ఆసక్తిని రేకెత్తించింది.

"నే నిక్కడి కెలా వచ్చాను?"

తన గొంతు తనే గుర్తుపట్టనంతగా మారిపోయింది.

అతని మాటలకి ఆ యువతి ఉలిక్కిపడి కనులు తెరిచింది.

అసలే విశాలమైన ఆమె కనులు ఆ ఉలికిపాటుకి మరింత విడిగి విప్పారాయి.

"నీకు గురుతు లేదా, అయ్యా. . . రెండు దినాల కితం... సందేలప్పుడు... వాగుకాడ చిరతపులి నిన్ను ఈడ్చుకు పోతుంటే, ఆ మాయదారి పులిని చంపి, నిన్ను రచ్చించి ఈడకు తీసుకు రాలేదా నా మగడు. . .వొలమ్మో. . . దాని పంజా దెబ్బలకి నీ ఒళ్ళు చితికిన మాంసం ముద్దలా అయిపోయి ఒకటే రక్త పెవాహం. . ." అప్పటి దృశ్యాన్ని అనుభూతి చెందుతున్నట్టు ఆమె కనులు మూసుకుంది.

అతను ఒకసారి తనను చూసుకున్నాడు.


తన ఒంటి మీద దుస్తులు లేవు, ఒక్క అండర్‌వేర్ తప్ప. ఒంటి నిండా అక్కడక్కడా ఏదో ఆకు పసరు వేసి కట్టిన కట్లు. . .


అతను ఒకసారి కనులు మూసుకున్నాడు.

సాయంసంధ్య నెమ్మదిగా చీకటి తెరల్ని దింపుతూంది. తను సుమారు రెండు గంటల నుండి ఆ మాటులో నక్కి, వాగుకేసి చూస్తున్నాడు.

ఎక్కడా పులి జాడ లేదు.

ఇంతకుముందు రెండు, మూడుసార్లు వచ్చి ఉత్త చేతులతో తిరిగి వెళ్ళిపోయాడు. ఫ్రెండ్సందరూ హేళన చేశారు. ముఖ్యంగా ఆ రోజు బార్‌లో ఆ మేజర్ మహేంద్రగాడు ఎంత 'షేమ్' చేశాడనీ! వెధవ—ఒక్క పులిని చంపినందుకు, అదీ కొండ పక్కన పొలాల్లో ఉన్న దిగుడు బావిలో పడిపోతే, గట్టు మీద నుంచి షూట్ చేశాడు. అలాంటి 'సిట్యుయేషన్' లో అంత 'షార్ట్ రేంజి' లో ఏ ఆడదాని చేతికి తుపాకిచ్చినా, కళ్ళు మూసుకుని కొట్టగలదు. అంతమాత్రానికే తనేదో పెద్ద 'ఇంటర్నేషనల్ హంటర్' లా ఫీలైపోతాడు. అలాంటివాణ్ణే తీసికెళ్ళి



ఏ ఆఫ్రికా అడవుల్లోనో వదిలేయాలి. అప్పుడు తెలుస్తుంది వెధవకి తనెంత హంటరో! అసలా రోజు బార్లోనే బీర్ బాటిల్‌తో బుర్ర బద్దలు కొట్టేద్దామనుకున్నాడు తను. అంతలో చటర్జీ వచ్చి అడ్డుకోబట్టి బతికి పోయాడు.

ఆ పంతంతోనే ఈసారి ఎలాగైనా పులిని కొట్టాలనే లక్ష్యంతో తనిక్కడికి వచ్చాడు.

కానీ, ఈసారి కూడా చుక్కెదురే అనిపిస్తాంది.

సరైన 'గైడ్' లేకుండా రావడం తను చేసిన పొరపాటు.

సమయం గడిచిపోతూంది.

కొండ చాటునుండి ఏపుగా పెరిగిన 'హోక్' చెట్ల పైకి చంద్రుడు ఎగ బ్రాకుతున్నాడు.

కొండవాగులో వెన్నెల ప్రతి ఫలిస్తూ, వెన్నెల వాగై ప్రవహి స్తోందా అన్నట్టుంది. గులకరాళ్ళ మీంచి నెమ్మదిగా ప్రవహిస్తూ వాగు చేస్తున్న సవ్వడి తప్ప, అంతటా గంభీరమైన నిశ్శబ్దం అలుముకుంది.

డిసెంబర్ నెల ఆఖరు దినా లవడం వలన చలి బాగానే వేస్తోంది. సన్నగా మంచు కూడా కురుస్తోంది. రెండు గంటల క్రితం తీసుకున్న 'బ్లాక్‌నైట్' ఫర్వాలేదు. బాగానే పన్జేస్తోంది.

ఉన్నట్టుండి అతని చెవులు ఏదో శబ్దాన్ని గ్రహించాయి.

చేతిలో 'వించెస్టర్' సింగిల్ బారెల్ బిగుసుకుంది.

వాగుకు ఆవలి గట్టున, రెల్లు పొదల మాటున రెండు కళ్ళు మెరిశాయి!

తన ఇన్నేళ్ళ అనుభవం చెప్పున పోల్చింది.

అది 'పేంథర్. . .చిరుత పులి. . .

నెమ్మదిగా అడుగులో అడుగు వేసుకుంటూ వస్తోంది.

సుమారు ఆరడుగు లుండొచ్చు. 'రేర్ స్పెసిమెన్. . .'

ఈసారి 'మిస్' కాకూడదు!

అతని గుండె వేగంగా కొట్టు కుంటూంది.

తుపాకీని పులి తలకు 'ఎయిమ్' చేస్తున్నాడు.

వాగు దగ్గర కొచ్చాక అకస్మాత్తుగా ఆగిపోయింది పులి. . .

అప్పుడు తెలిసింది తను చేసిన పొరపాటు.

గాలివాటు చూసుకోకుండా మాటు తయారు చేశాడు తను.

ఇప్పుడు పులి తన వాసన పసి గట్టిందా?

ఏమైనా తప్పదు. ట్రిగ్గర్ నొక్కాడు.

'ధన్!'

తుపాకీ ఫైర్ అయింది!

పులి తల ఒక్కసారి పైకెత్తింది.

గురి తప్పిన గుండు పులి మెడను రాసుకుంటూ, దూసుకుంటూ పోయింది.

గాయపడ్డ పులి భయంకరంగా గాండ్రిస్తూ, ఒక్కసారిగా తనున్న పొదపైకి దుమికింది.

ఆ అరుపుకు అడవంతా ప్రతి ధ్వనించింది.

తను రెండోసారి తుపాకీ 'ఫైర్' చేయబోయేంతలోనే బలమైన పంజా దెబ్బ మెడపైన పడింది. అంతే. . .

ఆ సంఘటనని ఇక వూహించ లేక, హఠాత్తుగా కళ్ళు తెరిచి దీర్ఘంగా నిట్టూరుస్తూ ఆమెకేసి చూశాడు.

ఆమెకూడా అతనివైపే చూస్తోంది.

అతను చుట్టూ ఒకసారి కలియ చూసి,

"మరి నీ మగడేడి?" అడిగాడు ఆ ఇంట్లో ఇంకెవ్వరూ కనిపించక పోయేసరికి.

"ఈయాల్టిదాకా నీకు తెలివి రాకపోతే, ఏదో మందుకోసమని మా గూడెం ఎల్లిండు. . ." అందామె.

అతను ఆశ్చర్యపడుతూ—

"మరి, ఇది గూడెం కాదా. . ." అన్నాడు.

అందు కా యువతి కాదన్నట్టు అడ్డంగా తలూపుతూ—

"ఇది గూడెం కాదు దొరా. . .మేం, ఒంటిగా ఈడ గుడిసేసుకుంటిమి..." అంది.

అతను మరింత ఆశ్చర్యం వ్యక్తం చేస్తూ, "మరి మీ వాళ్ళందరితో కలిసి గూడెంలో ఉండక, ఈ నట్టడివిలో ఒంటరిగా, ఇలా ఎందుకుంటున్నారు..." అన్నాడు.

అందు కా యువతి నిట్టూర్చి—

"అదంతా ఒక కథలే దొరా!" అంటూ చూపు వేలకు తిప్పి చెప్పింది.

"కొండదేవత సంబరాలప్పుడు తొలి చూపుల్లోనే "శ్రీ" కి మన సిస్తిని. మా గూడెం పక్కనే "శ్రీ" గూడెం ఉండేది. ఇటికీవల మా గూడెం అవల ఆడి గూడెం. . . మా ఇద్దర్నీ ఏరు సేస్తూ మద్దిన ఏరు. . .ఏటి ఒడ్డున ఎన్నెట్లో ఎన్నెన్నో వూసు లాడుకుంటిమి.

ఎన్నెన్నో బాసలు సేసుకుంటిమి. మనువు సేసుకోవాలనుకుంటిమి. కానీ—దొరా!

మా గూడెం పెద్దలు గున్సు మంటిరి.'

ఈ మనువు జరగదంటిరి.

ఆణ్ణే మనువాడకుంటే నేను బతకనంటిని.

మనువాడితే ఆణ్ణే బతకనివ్వ మంటిరి.

ఆడిమీద కచ్చగట్టిరి.

ఎటూ పాలుపోక ఎన్నో రేత్తిర్లు ఏడిస్తిని. . .

నో ఎన్నెల రేతిరి, "శ్రీ" ఒచ్చి, కొండదేవత ముందు నా నుదుట బొట్టు దిద్దాడు.

అదే ఆకరు.

మళ్లీ మా గూడెం కెల్లలేదు.

నాకు "శ్రీ", "శ్రీ" కి నేనూ ఒకరి కొకరై ఈడనే ఉండిపోతిమి."

గతాన్ని నెమరు వేసుకుంటున్నట్టు ఆమె కనులు మూసుకుంది.

అంతవరకూ ఆమె చెబుతున్నది వింటూ, దృశ్యాన్ని వూహించుకుంటూ అనుభూతి చెందుతున్న అతను ఉన్న ట్టుండి ఆమె మాట్లాడకపోయేసరికి ఆమెవైపు చూశాడు.

పండువెన్నెల్లో బొండుమల్లెలా... మంచులో తడిసిన మందారంలా. . .

అప్పుడే విచ్చుకుంటున్న గులాబీ మొగ్గలా. . .ఆ ముగ్ధ సౌందర్యానికి తన్మయుడయ్యా డతను.

అంతలో ఆమె కనులు విప్పి తదేకంగా తననే చూస్తున్న అతన్ని చూసి స్త్రీ సహజమైన సిగ్గుతో తొట్రుపడింది.

"మరి నీ మగడు మందుకోసం గూడెం కెళ్ళాడు కదా! అక్కడేం ప్రమాదం జరగదా?" అడిగా డతను.

క్షణకాలం ఆమె కన్నుల్లో భయం

తొంగి చూసినా—

"గూడెంలో ఆడ కెవరూ ఎదురు నిలవలేరయ్యా... ఆ కొండదేవర వల్లగా మాడాలేగానీ..." అంటూ కనులు మూసుకుని మనసులోనే కొండదేవతకు మొక్కుకుంది.

ఏమైనా తనను ఆపద నుండి కాపాడి, చివరకు తన ప్రాణాలను కూడా లెక్క వేయకుండా మళ్ళీ ప్రమాదకరమైన గూడెంలో అడుగు పెట్టిన "శ్రీ" ని చూడాలనిపించిం దతనికి.

"ఉండు, దొర—రెండు దినాల్నుండి వచ్చి మంచినీళ్ళయినా ముట్టవైతివి. పాలు తెస్తాను— తాగుదుగానీ..." అంటూ ఆమె లోపలి కెళ్ళింది.

అలా నడిచి వెళ్తున్న ఆమె వన కిన్నెరలా అగుపించింది అతనికి...

గుండ్రటి నునుపైన భుజాలు... సన్నటి నడుము... అక్కణ్నుంచి విశాలంగా పరుచుకున్న బరువైన పిరుదులు... కండ పుష్టితో ఆరోగ్యంగా ఉన్న తొడలు... సహజంగా స్వేచ్ఛగా పెరిగిన ఉన్నతమైన వక్షోజాలు... గ్రీకు సుందరిలా, పోతపోసిన స్త్రీత్వంతో... జుంటి తేనెలాంటి... జున్ను ముక్కలాంటి ఆమె యౌవనం అతనిలో అలజడి రేకెత్తించింది.

కనుబొమలు గీసేసి, ముడతలు పడ్డ మొహాల్ని క్రీములతో మర్దనా చేసి, బ్యూటీ పార్లర్‌లలో బ్లీచింగ్ చేసిన పేడి మొహాలతో, కృత్రిమ అవయవ పొంకాలతో, అణువణువునా అసహజత్వంతో అందాల రాణుల మనుకునే నాగరిక స్త్రీలు...

వేలకు వేలు లాగేసి, విస్కీలు, వోడ్కాలు తాగేసి వెగటు వాసనతో, వికృతంగా బలిసిన శరీరాలతో బెడ్‌పై బస్కీలు తీసే రీమా... సీమా... రీటాల మోటు శృంగారాలు... అన్నీ గుర్తొచ్చాయి అతనికి.

ఆమె అపురూప సౌందర్యం ఉన్మత్తుణ్ణి చేస్తోంది అతన్ని.

ఎదురుగా గుమ్మంలోంచి దూరంగా ఎర్రబడ్డ సూర్యుడు పడమటి కొండల్లోకి దిగిపోతున్నాడు.

ఆ ఎరుపుదనం కొండవాగులో వింతగా ప్రతిఫలిస్తోంది.

కొండవాగులో ప్రతిఫలించిన ఎర్రదనం క్రమంగా అతని కళ్ళల్లోకి ప్రవహించింది.

ఆమె వెదురుబొంగుతో పాలు పట్టుకొచ్చింది.

అందుకోవటానికి అతను చేయి చాపాడు.

ఆమె అతన్ని వారిస్తూ, "ఉండు, దొరా... నువ్వు తాగలేవు... నేను పడ్తాను..." అంటూ మోకాళ్ళ మీద కూర్చుని, అతని గుండె మీదుగా ఒంగి, నెమ్మది నెమ్మదిగా అతని నోట్లో పాలు ఒంపుతోంది.

మెత్తని ఆమె హృదయం అతని హృదయాన్ని హత్తుకుంది.

ఎత్తయిన ఆమె గుండెలు అతని గుండెకు ఒత్తుకున్నాయి.

అతనిలో ఏదో మత్తు ఆవరించింది. మైకం కమ్మింది.

అతని రక్తం సెగలు కక్కింది—కోరిక బుసలు కొట్టింది.

కామం పులిలా గాండ్రించింది.

అతని చేతులు ఆమెను బలంగా చుట్టేశాయి.

అతని చేష్టలకు ఆమె బిత్తరపోయి—

"ఏమైంది, దొరా, నీకు?" అంది విడిపించుకోవడానికి ప్రయత్నిస్తూ.

అయినా అతని పట్టు సడలలేదు. మరింత బిగుసుకుంది.

గాయపడ్డ అతనిలో అంత శక్తి ఎలా వచ్చిందో ఆమెకేగాక అతనికి కూడా ఆశ్చర్యాన్ని కలిగించింది.

పరిస్థితి అర్థమై—

ఆమె అరిచింది, అడవంతా ప్రతిధ్వనించేలా...

ఏడ్చింది, గుండె పగిలేలా...

అరిచి—ఏడ్చి—చివరికి...

సొమ్మసిల్లిపోయింది.

అయినా అతని కామం సొమ్మసిల్లలేదు.

కోరిక చల్లబడలేదు.

కీటకాన్ని కబళించే బల్లిలా... లేడిపైకి దుమికే పులిలా...

ఆమెపై అతను...

అంతే—

ఎక్కణ్నుంచో సర్రున దూసుకొచ్చిన పదునైన బాణం అతని వెన్నును చీల్చుకుని, గుండెలో దిగబడింది.

"అబ్బా" అంటూ అడవి దద్దరిల్లేలా అరుస్తూ పడిపోయాడతను. పడిపోతూ చూశాడు—గుమ్మంలోంచి దూరంగా కండలు తిరిగి, శిలలా ఏపుగా ఉన్న కోయ యువకుణ్ణి... అతని చేతిలోని విల్లుని.

అతనే తనను పులివాత నుండి రక్షించినవాడనీ, ఈసారీ అతడే ఆమెను మృగంలాంటి మనిషి బారి నుండి కాపాడినవాడనీ... అతడే ఆమె మగడు "శక్రి" అని అతనికి తెలుసో... తెలియదో...





